ప్రజాశక్తి
గురువారం 9 నవంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు

దిశ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-అరకులోయరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థినులకు దిశ యాప్ పై బుధవారం స్థానిక మహిళా పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ అధ్యక్షులు పి.సుందరరాజేశ్వరి, మహిళా పోలీస్ జె.వర్ష మాట్లాడుతూ, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి ప్రభుత్వం దిశ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఈ దిశ యాప్ ఆపదలో అత్య రక్షణగా ఉంటుందని చెప్పారు. మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సభ్యులు వై.విజయలక్ష్మి, ఎం.అనిత కుమారి, జె.సంధ్య, ఎస్.అన్నపూర్ణ, మహిళా పోలీసులు కె ప్రియాంక, జెమ్ జ్యోతి, కాంతమ్మ, రాజేశ్వరి,భవాని పాల్గొన్నారు.

దిశ యాప్‌ను చూపిస్తున్న విద్యార్థినులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ...

విద్యా సంస్థల బంద్ సంపూర్ణం

-పలుచోట్ల ర్యాలీలు, ధర్నాలు - మూతపడిన పాఠశాలలు, కాలేజీలు

పాడేరులో ర్యాలీ చేపడతున్న విద్యార్థి సంఘాల నేతలు

ప్రజాశక్తి పాడేరు:- వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ప్రభుత్వమే నడిపిస్తూ, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ, బుధవారం పాడేరు మండల కేంద్రంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించి, ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద ఎత్తున పాడేరులో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ మరియు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చిన్నారావు మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత ఉన్న వైజాగ్ ఆర్ఐఎన్ఎల్ స్టీల్ ప్లాంట్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ పరం చేయడానికి ప్రయత్నిస్తోందని, ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువజనులు పోరాట, త్యాగఫలతో విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అయ్యిందన్నారు. 23 వేల ఎకరాల విస్తీర్ణంలో కేవలం 4800 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు దాదాపు 54వేల కోట్లు తిరిగి చెల్లించి, 32 లక్షల టన్నుల నుంచి 74 లక్షల టన్నులకు సామర్థ్యాన్ని పెంచుకుని నేడు 3లక్షల కోట్లు విలువ చేసే ఆస్తులతో లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాది కల్పిస్తోందని తెలిపారు. అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన స్టీల్ ప్లాంట్ ను ఫోక్సో అనే విదేశీ కంపెనీకి కట్టబెట్టడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించకుండా నష్టాలలో ఉందనడం సరైంది కాదన్నారు.వైజాగ్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం 2022-23 సంవత్సరానికి గాను తన ఖర్చులను తగ్గించుకుని ఎక్సలెన్స్ ఇన్ కాస్ట్ మెనేజ్ మెంట్ లో నేషనల్ అవార్డ్ సాధించి, లాభాల బాట పట్టిందన్నారు. కరువు కాటకాలకు నిలయమైన రాయలసీమ ప్రాంత ఉద్యోగులకు ఉపాది కల్పించడానికి కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినప్పటికి, నేటికి నిర్మాణం కోసం నిధులు కేటాయించకుండా, నిరుద్యోగ జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుకుంటుందన్నారు. ఇప్పటికైనా వైజాగ్ స్టీల్ ప్లాంట్ కరణను విరమించుకొవాలని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం త్వరగా చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించి, నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో , ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. లక్ష్మణ్, టిఎన్ఎస్ఎఫ్, జి ఎస్ యు మండల నాయకులు దేవా, నాని, మరియు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, నాయుడు, చంటి, చిట్టి, తదితరులు పాల్గొన్నారు.

కూనవరంలో బంద్ పాటిస్తున్న నేతలు

కూనవరం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని కోరుతూ రాష్ట్రంలోని విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు బుధవారం మండలంలో విద్యా సంస్థల బంద్ సంపూర్ణంగా జరిగింది. ఎస్ఎఫ్ఐ, సిఐటియు, సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని డిగ్రీ కళాశాల, ప్రైవేటు స్కూళ్లు మూతపడ్డాయి. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఈ ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పాలని, లేని పక్షంలో రాబోయే ఎన్నికలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు కొండ ఈశ్వర్లు, రైతు సంఘం నాయకులు గడ్డిపాటి షణ్ముఖరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పెదబయలు : బుధవారం చేపట్టిన బంద్ విజయవంతం అయింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మూతపడ్డాయి. విద్యార్థులు వసతిగృహాల్లో ఉంటూ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ విద్యార్థులు నిరసన తెలిపారు.

ధర్నా అనంతరం ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు, సిపిఎం ప్రజాప్రతినిధులు

2 నెలలుగా రేషన్ బియ్యం ఇవ్వకపోవడంపై నిరసన

- ఎండియు వాహనదారుడిని తొలగించాలని డిమాండ్

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని పెద్దర్కూర్, కూటూరు రెండు పంచాయితీల పరిధిలోని గండి కొత్తగూడెం గ్రామంతో పాటు సుమారు 8 గ్రామాలకు రెండు నెలలుగా రేషన్ బియ్యం ఇవ్వకపోవడంపై సిపిఎం ఆధ్వర్యాన బుధవారం చింతూరు ఐటీడీఏ కార్యాలయం వద్ద బాధితులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఐటిడిఎ పిఒ చైతన్యకు వినతిపత్రం అందజేశారు. ఎండియు వాహనదారుడు పూసం ప్రసాద్‌ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ ఎండియు వాహనదారుడు ప్రసాద్ ఇంతకు ముందు కూడా ఇలాగే చేశారని, పలు మార్లు బియ్యం విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ నెల కూడా ఇంకా బియ్యం ఇవ్వలేదన్నారు. ఎందుకు ఇవ్వలేదని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడన్నారు. గతంలో ఇతనిపై విఆర్‌ఓకి, తహాశీల్దారుకు ఫిర్యాదు చేశామని, అయినా ఆయన వైఖరిలో మార్పు రాలేదని పేర్కొన్నారు. తక్షణమే ఎండియు వాహనదారుడిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగమణి, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, తమ్మయ్య, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

మాట్లాడుతున్న శంకరరావు

ప్రజాశక్తి -పాడేరు: గిరిజనాభివృద్దే లక్ష్యంగా అధికారులు ఏజెన్సీలో సేవలందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి. శంకరరావు స్పష్టం చేసారు. రెండు రోజుల ఏజెన్సీ పర్యటనలో భాగంగా ఐటిడిఏ సమావేశ మందిరంలో అధికారులతో బుధవారం సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నకిలీ కుల ధృవపత్రాల నిర్మూలనకు చర్యలు చేపడతామన్నారు. ఏజెన్సీలో రోడ్ల నిర్మాణాలకు అత్యధికంగా వినతులు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్దిదారులకు అందించాలని సూచించారు.గృహ నిర్మాణ, తాగునీటి పథకాలు, ఉపాధి హామీ, డ్రైనేజీలు, అంగన్వాడీ సేవలు, గిరిజనుల అక్షరాస్యత, విద్యా సదుపాయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ పిఓ వి.అభిషేక్ మాట్లాడుతూ పాడేరు, అరకువ్యాలీ నియోజక వర్గాల గిరిజన జనాభా, అక్షరాస్యత, విద్యా, వైద్య సేవలు, పర్యాటక అభివృద్ధి, కాఫీ ప్రాజెక్టు అమలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రధాన మంత్రి ఆది గ్రామ ఆదర్శ యోజనలో 220 గ్రామాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ఈ పథకంలో ప్రతి పంచాయతీకి రూ.20 లక్షల 38 వేల నిధులు కేటాయిస్తారన్నారు. ప్రధాన మంత్రి పివిటిజి మిషన్ అమలు, రోడ్డు నిర్మాణాలు, గిరిజన యువతకు ఉచిత సివిల్స్ శిక్షణ పై వివరించారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి కె.ధరజ్, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఇ ఇలు డి.వి.ఆర్ ఎం.రాజు, కె.వేణుగోపాల్, గృహనిర్మాణ శాఖ ఇఇ బాబు, ఎస్టీ కమిషన్ సభ్యులు ఎం.విశ్వేశ్వరరాజు, రామలక్ష్మి, స్థానిక నేతలు తడబారికి సురేష్, విశ్వపాల్గొన్నారు.

గిరిజనులకు ఎల్లవేళలా ఎస్టీ కమిషన్ అండ

పాడేరు : గిరిజనులకు ఎల్లవేళలా ఎస్టీ కమిషన్ అండగా నిలుస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు స్పష్టం చేసారు. రెండు రోజుల ఏజెన్సీ పర్యటనలో భాగంగా బుధవారం. పాడేరు మండలం గొండెలి పంచాయతీ లింగాపుట్టు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి గిరిజన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. గిరిజన ప్రాంతంలో విద్య, వైద్య రంగాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. పాడేరులో మెడికల్ కళాశాలను నిర్మించడంతో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ముందుగా మోద కొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక జిల్లా ఆసుపత్రి (పాత)ని సందర్శించారు. అక్కడ వైద్య పరీక్షలకు వచ్చిన గర్భవతులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీసారు. నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని గర్భిణీలకు సూచించారు.

చైర్మన్ ను కలిసిన జిల్లా కలెక్టర్, పి ఓ

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఏ పిఓ వి అభిషేక్ పి.ఎంఆర్.సి భవనంలో కమిషన్ చైర్మన్ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు టి.నర్సింగరావు. ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం.వెంకటలక్ష్మి, ఎస్టీ కమిషన్ సభ్యులు ఎం.విశ్వేశ్వరరాజు, రామలక్ష్మి, తహశీల్దార్ త్రినాధరావు నాయుడు, తడబారికి సురేష్, విశ్వ పాల్గొన్నారు.

చిత్ర లేఖనంలో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

చిత్రలేఖనంలో జెడ్‌పి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -రాజవొమ్మంగి

చిత్రలేఖనం పోటీల్లో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో ఇటీవల నిర్వహించిన చిత్ర లేఖనం పోటీలలో ఈ పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థినులు ప్రతిభ కనబరిచి 9 గోల్డ్ మెడల్స్ సాధించి సత్తా చాటారు. ఈ నేపథ్యంలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థుల అభినందన సభ బుధవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించడం పాఠశాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు మంచి తర్ఫీదు ఇచ్చిన చిత్రలేఖన ఉపాధ్యాయులు ఎం.కొండబాబును సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ సిహెచ్ వీరబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌కు సన్మానం

ప్రజాశక్తి అరకులోయ రూరల్: ముంచంగిపుట్టు మండలం జోలపుట్ పంచాయతీ తోటగొందిపుట్టు గ్రామనికి చెందిన జెమ్మ నాలుగేళ్ళుగా ఆశా వర్కర్‌గా పనిచేస్తుంది. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక పోవడంతో రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం రోడ్డు రోడ్డు సౌకర్యం కల్పించక పోవడంతో ఆమెకు నెలకు వచ్చే 4 వేలతో పాటు తన సొంత నిధులు రెండు లక్షల 50 వేలతో మట్టి రోడ్డు నిర్మంచారు. ఈ సందర్భంగా ఆమె సేవలను గుర్తించి గిరిజాగృతి అసోసియేషన్ అధ్యక్షుడు మోరి సింహాచలం ఆధ్వర్యంలో బుధవారం అరకువేలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంయుక్తంగా ప్రిన్సిపాల్స్ భరత్ కుమార్ నాయక్, రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చలపతిరావు, శ్యామ్ గణేష్ సమక్షంలో ఘనంగా సన్మానించారు.ఆశా వర్కర్ జెమ్మ చేసిన సేవలు ఆదర్శప్రాయంగా నేటి తరానికి ఉంటుందని వక్తలు కొనియాడారు.

సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

మాట్లాడుతున్న గంగరాజు

టూరిజం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి- అనంతగిరి: ఏపీ టూరిజం కార్మికులకు ఇచ్చిన హామీలు పరిష్కరిస్తారా లేకుంటే బొర్రా గుహలను ఆక్రమించుకొవాలా బొర్రా, అనంతగిరి, తేడా, అరుకు లంబసింగ్, మండలాల యూనిట్లలో పని చేస్తున్న టూరిజం కార్మికులు ఏపీ టూరిజం శాఖకు హెచ్చరించారు. బుధవారం అనంతగిరి మండలం ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల వద్ద ఆయా యూనిట్ల కార్మికులు ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక ప్రజా ప్రతినిధులైన జెడ్పీటీసీ. గంగరాజు సర్పంచ్‌లు జె,అప్పారావు, కె,మొస్య, ప్రజా సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన జడ్పిటిసి, సర్పంచులు ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రముఖ పర్యాటక శాఖలో పని చేస్తున్న కార్మికుల న్యాయపరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత నెలలో సమ్మెబాట చేపట్టేందుకు కార్మికులు పిలుపునివ్వడంతో ఆ శాఖ యాజమాన్యం ప్రభుత్వం తరపున ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, తమ ప్రజా నాయకులు కార్మిక యూనియన్ల సంఘాలతో గత నెల 10 రోజుల క్రితం బహిరంగ చర్చలు జరపగా సమస్యలను పరిష్కరించేందుకు పది రోజులు గడువు కోరిందని తెలిపారు. అప్పటినుండి నేటి వరకు దినాలు గడిచిపోతున్నా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫులమైందని విమర్శించారు. అందుకు నిరసనగా కార్మికులు అనంతగిరి, అరకు, చింతపల్లి మండల కేంద్రంలోని సుమారు 6 యూనిట్లను మూసివేసి సమ్మెకు సిద్ధమవు తున్నాయని తెలిపారు. కార్మికులకు అండగా పోరాటానికి మద్దతు ప్రకటిస్తున్నామని వారు స్పష్టం చేశారు. పర్యాటక శాఖలో రూపాయలు నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఆర్జిస్తూ ఆ శాఖలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ. పని భద్రత కల్పించకుండా నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. కార్మికులు చేపట్టే సమ్మెకు తాము మద్దతు ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ కార్మికుల సంఘాల నాయకులు జి.గురు, వెంకటరాజు, బుద్దరాజు, గాసి పాల్గొన్నారు

ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ...

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం, సప్పర్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు తక్షణమే రక్షణ గోడ నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పాఠశాల చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో క్రూర మృగాలు తరచూ పాఠశాల ఆవరణలోకి రాత్రి సమయంలో ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాల అటవీ ప్రాంతానికి అతి సమీపంలో ఉండడంతో గొర్ర గేదెలు, ఎలుగుబంట్లు తదితర జంతువులు రాత్రివేళ విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. అవి ఏ క్షణంలో విద్యార్థులపై దాడి చేస్తాయని భయాందోళన చెందుతున్నారు. విద్యార్థులు హాస్టల్ వసతి భవనాల్లో రాత్రి సమయాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. పాఠశాలకు రక్షణ గొడ నిర్మించాలని అనేకసార్లు విద్యార్థులు, తల్లిదండ్రులు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఏ పిఓ అభిషేక్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. ఎనర్జిస్ నిధులతో అరకొర గోడను పాఠశాల ముందు రోడ్డు వైపు నిర్మించి ప్లాస్టింగులు కూడా చేయకుండా విడిచిపెట్టారు. అధికారులు తక్షణమే స్పందించి సప్పర్ల ఆశ్రమ పాఠశాలకు క్రూర మృగాలు నుంచి ఎటువంటి ప్రాణహాని విద్యార్థులు కలగకుండా రక్షణ గోడ నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అడవి పక్కనే ప్రహరీ లేకుండా ఉన్న సప్పర్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. మండలంలోని జడ్డంగి పంచాయితీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ ఆధ్వర్యాన జరిగింది. జడ్డంగి పంచాయతీ పరిధి జమ్మచావిడి, చిన్నయ్యపాలెం, దోనెలపాలెం తదితర గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఈ నాలుగు సంవత్సరాలు కాలంలో వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు నగదు ఎంత వచ్చిందో తెలియజేశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి సరిచేసి అర్హులైన వారందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచులు దాసరి నాగేశ్వరరావు, ఆగూరి సుబ్బలక్ష్మి, కించు రాజేశ్వరి, చంద్రుడు, రాజవొమ్మంగి సీఐ షేక్ బాజీలాల్, జడ్డంగి ఎస్ఐ రఘునాధరావు, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, ఐసిడిఎస్ సిడిపిఓ దేవమణి, వైసీపీ నాయకులు దాట్ల వెంకటేశ్వరరాజు, ఎస్.రవి, సిహెచ్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఫోక్స్‌పేటలో 'జగనే ఎందుకు కావాలి'

రంపచోడవరం : మండలంలోని ఫోక్స్‌పేట పంచాయతీ దేవరాతి గూడెం గ్రామ సమీపంలోని సమావేశ భవనంలో జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం ఫోక్స్‌పేట గ్రామపంచాయతీ సర్పంచ్ పండా లక్ష్మీ నాగు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి పండా కుమారి, మండల కన్వీనర్ పండా నాగన్న దొర మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంతోనే ఆంధ్ర రాష్ట్రం భవిష్యత్తు ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి పార్టీని బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

10న కొయ్యూరులో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-కొయ్యూరు : ఈ నెల పదవ తేదీ శుక్రవారం కొయ్యూరులో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొయ్యూరు ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని వెల్లడించారు. స్పందన కార్యక్రమం అనంతరం శాఖాధికారులు సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. కొయ్యూరులో స్పందన కార్యక్రమం ఉన్నందున ప్రతి శుక్రవారం పాడేరులోని ఐటీడీఏ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి పాడేరులో స్పందనకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ దర్జు తదితరులు

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జెన్ ఆరోగ్య యేజన, డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య రక్షణ పథకం కార్డులను సర్పంచ్ దుర్జు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్జు ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి మాట్లాడుతూ సీలేరు మేజరు పంచాయతీకి 144 కార్డులు వచ్చేయని తెలిపారు. ఈ పథకం ద్వారా కార్పొరేట్ హాస్పిటల్‌లో రూ.5 లక్షల వరకు ఉచితంగా చికిత్స పొందవచ్చన్నారు. ప్రభుత్వం అందజేసిన ఈ కార్డులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుమస్తా ప్రకాష్, సచివాలయం సిబ్బంది, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు టైల్స్ వితరణ

ప్రజాశక్తి -కొయ్యూరు

కొయ్యూరు వర్తక సంఘం అధ్యక్షులు, టిడిపి నాయకుడు మేడిబోయిన చక్రరావు (చిన్న) కొయ్యూరు గురుకుల పాఠశాలకు రూ.10వేల విలువగల టైల్స్‌ను మంగళవారం అందించారు. పాఠశాలలోని విద్యార్థులకు చక్కని విద్యాబోధన తీరుకు, ప్రశాంత వాతావరణానికి ఆకర్షితుడునైన తాను పాఠశాలకు ఏదో రూపంలో సాయం చేయాలన్న తపనతో టైల్స్‌ను వితరణగా అందించినట్టు దాత మేడిబోయిన చిన్నా తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయుడు శేఖర్, సిబ్బంది, గ్రామస్తులు వజ్రపు రాము పాల్గొన్నారు.

టైల్స్ అందజేస్తున్న మేడిబోయిన చిన్న

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సభ్యుడు

ప్రజా సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-చింతపల్లి : మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడివో ఆశాజ్యోతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ సమస్యలపై వాడి వేడిగా చర్చ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపిపి కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య విచ్చేయగా మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు మధ్య మండలంలో నెలకొన్న వివిధ సమస్యలపై వాడి వేడి చర్చ జరిగింది. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల ఉదాసీనతతో పలు సమస్యలు దర్శనమిస్తున్నాయని ప్రజాప్రతినిధులు ఎంపిపి, జడ్పిటిసి ల దృష్టికి తీసుకు వచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం సమాచారం ఇవ్వకుండా అధికారులు ఇష్టానురీతిన వ్యవహరిస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపార్టీలకు అతీతంగా పథకాలను అందజేస్తున్నందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ డైరెక్టర్ సుర్ల లోవరాజు, వైస్ ఎంపిపిలు గోపి నాయక శారద, సాగిన వెంగళరావు, తహసిల్దార్ లచ్చా పాత్రుడు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెదబయలు : మండల పరిషత్ సర్వ సభ సమావేశం ఎంపిపి బోండా వరహాలమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల ఛైర్పర్సన్ జల్లి పల్లి సుభద్రమ్మ మాట్లాడారు. ఈ సమావేశంకు పూర్తి స్థాయిలో సభ్యులు రాకపోవడంతో 11.45 గంటలకు ప్రారంభమైంది. ఎంపిడిఓ విగ్నేష్ నివేదికలను అడిగి సభ్యులకు వినిపించారు. అనంతరం మండల ఎంపిటిసిల ఫోరమ్ అధ్యక్షులు కె బొంజుబాబు కొన్ని సమస్యలు లేవనెత్తారు. సంబంధిత అధికారులు పొంతన లేని సమాదానాలు చెప్పడంతో ఎంపిటిసి సభ్యులు అగ్రహాం వ్యక్తం చేసారు. మండలంలో 14 డి పి ఎఫ్ ప్రాథమిక పాఠశాలలు మంజూరైన్నా వాటిలో ఈ ఒక్కటి పూర్తి కాలేదన్నారు. సీతాగుంట పంచాయతీ రోగులపేట గ్రామంలో సర్వ శిక్ష అభియాన్ ద్వారా 7 లక్షలతో నిర్మిస్తున్న పాఠశాల భవనం పూర్తి కాలేదన్నారు. మండలంలో 14 పాఠశాల భవనాలు అసంపూర్తిగా మిగిలాయని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టు, ఇంజి నీరింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని బొంజుబాబు కోరారు. బొంగరం పంచాయతీ లో సచివాలయం పంచాయతీ భవనాలు నేటికీ మంజూరు కాలేదన్నారు. పర్రెడా పంచాయతీ లో కళ్ళబు గ్రామం లో ఆశ వర్కర్ నియమించాలని పర్రెడా సర్పంచ్ సిహెచ్ రవి శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిడిఓ ఎల్ పూర్ణయ్య, తహసీల్దార్ సిహెచ్ కృష్ణారావు, సీడీపీఓ రాజ్యలక్ష్మి, మండల విద్యాశాఖది కారిణి డేవిడ్ పుష్ప పాల్గొన్నారు

ఫారెస్ట్ అధికారుల వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఆదివాసీలను ఫారెస్ట్ అధికారులు వేదింపులు ఆపాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ తెలిపారు. వనభాసింగి గ్రామ పంచాయతీ టొంగికోట గ్రామంలో రెండు రోజుల క్రితం మర్రి.రాజు అనే వ్యక్తి పోడు వ్యవసాయం చేసేందుకు అటవి భూమిని చదును చేస్తుంటే ఫారెస్ట్ అధికారులు వచ్చి కేసు నమోదు చేస్తామని బెదిరించారన్నారు. ఫారెస్ట్ కార్యాలయంలో వచ్చి వ్యక్తి గతంగా కలవాలని భయపెట్టడం సరి కాదన్నారు. అటవీ హక్కు చట్ట ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి పోడు వ్యవసాయం నిమిత్తం అటవీ భూమి ఉచ్చితంగా ఇవ్వాలన్నారు. 30 సంవత్సరాలుగా పోడు వ్యవసాయం చేస్తున్న అటవీ భూమిని చదును చేస్తుంటే కేసులు పేడతామని గ్రామంలో భయపెట్టడం, భయభ్రాంతులకు గురి చేయడం అటవీ చట్టానికి విరుద్ధమని తెలిపారు,

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఈనెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత చెప్పారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవరణలో పుస్తకాల ప్రదర్శన, వ్యాసరచన, పాటల పోటీలు, పలు ఆటల పోటీలు విద్యార్థులకు నిర్వహించి చివరి ముగింపు రోజు విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు ఆమె తెలిపారు.

ఐదో షెడ్యూల్ స్ఫూర్తికి విఘాతంగా..

ఐసిడిఎస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

ఆదివాసీ గిరిజన సంఘం నేత అప్పలనరస ధ్వజం

మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు : ఆదివాసీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తుందని ఐదవ షెడ్యూల్ స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా ఆదివాసీలకు అవకాశాలు లేకుండా ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్లు జారీ చేస్తోందని, ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పల నర్స విమర్శించారు. మొన్న గురుకులంలో ఆదివాసీలకు ఉద్యోగం లేదని, నేడు ఐసిడిఎస్‌లో ఆదివాసీలకు ఒక్క ఉద్యోగం కేటాయించలేదని, రేపు మరో శాఖలో ఇదే దారుణంపునరావతంకానుందని, అధికార, ప్రతిపక్ష, వామపక్ష రాజకీయ పార్టీలు ఆదివాసీ ప్రజా, నిరుద్యోగ సంఘాలు ప్రభుత్వ వైఖరిని ఖండించాలని పిలుపునిచ్చారు. పాడేరు ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స మాట్లాడుతూ, తక్షణమే ఐసిడిఎస్ నోటిఫికేషన్ రద్దు చేయాలని, ఆదివాసీ యువతకు ఉద్యోగ రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఆదివాసీలకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా ప్రభుత్వ అధికారులు జారీ చేస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్ 5వ షెడ్యూల్డ్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. గురుకులం, ఏకలవ్య పాఠశాలలు, నేడు శిశు సంక్షేమశాఖ (ఐసిడిఎస్)లు భర్తీ చేస్తున్న మిషన్ వాత్సల్య 22 పోస్టులు కూడా ఒక్క పోస్ట్ స్థానిక ఆదివాసీలకు కేటాయించలేదన్నారు. ఆదివాసీ నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఆదివాసీ నిరుద్యోగులు ఉద్యోగం కోసం కోచింగ్ పేరుతో లక్షలాది రూపాయలు అప్పులు పాలై ఉద్యోగ నోటిఫికేషన్లకు ఎదురు చూస్తుంటే ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆదివాసీ తెగలకు జరుగుతున్న తీవ్రమైన అన్యాయంపై స్పందించాలన్నారు. 5వ షెడ్యూల్డ్ క్లాజ్ - 2 ప్రకారం జి.ఓ నెం. 3 రిజర్వేషన్ చట్టబద్ధతకు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీచేయాలని గిరిజన సలహ మండలి తీర్మానం చేసినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని గౌరవించడం లేదని చెప్పారు. పాడేరు ఐటిడిఏ ప్రాంతంలో ఉపాధ్యాయుల బదిలీ సందర్భంగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు, ఎస్ జి టి స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సుమారు 600 పోస్టులు వివిధ కారణాలు చూపుతూ ఏజెన్సీ ప్రాంతంలో రద్దు చేశారని చెప్పారు. విద్యార్థుల సంఖ్య తక్కువ వుందని 107 స్కూల్స్ మూసివేసారని తెలిపారు. గిరిజన స్పెషల్ డిఎస్సీ 1495 గిరిజన సంక్షేమశాఖ టీచర్ పోస్టులు (అల్లూరి జిల్లాలో 611 పోస్టులు) మరియు 40వేల మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలలో 2.50 లక్షల ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎస్ఐ జిల్లా కార్యదర్శి పాంగి చిన్నారావు, స్థానిక ఆదివాసీ నిరుద్యోగులు శ్రీనివాస్, శంకర్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి వీలుగా అన్ని రంగాలలో సచివాలయ, వాలంటీర్లకు శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి మండల అభివృద్ధి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 22 మండలాలలో 352 సచివాలయాలకు చెందిన సుమారు 5,700 మంది వాలంటీర్లు, 3,200 మంది సచివాలయ సిబ్బందికి అవసరమైన శిక్షణలు ఇవ్వడానికి షెడ్యూల్ సిద్ధం చేయాలని, అదేవిధంగా శిక్షకులకు భోజన వసతి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సిబ్బందికి రెండు గ్రూపులుగా మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారని, శిక్షణలో స్ట్రెస్ మేనేజ్మెంట్, రికార్డుల నిర్వహణ, స్పందన సమస్యల పరిష్కారం, సమయ పాలన, ఫేషియల్ హాజరు, సిబ్బంది విధులు, భాధ్యతలు, ప్రజలకు అందించాల్సిన సేవలు, కెపాసిటీ బిల్డింగ్ తదితర అంశాలతో పాటు కార్యాలయ నిర్వహణ తదితర అంశాలలో శిక్షణ ఇస్తామన్నారు. ఎంపిడిఓలు శిక్షణ స్థలం గుర్తింపు, మండలంలో ఎంతమంది సిబ్బంది, ఎన్ని రోజులు శిక్షణ, ఎల్.ఇ.డి, స్క్రీన్లు, ప్రొజెక్టర్ తదితర సామగ్రి ఏర్పాటు చేసుకోవాలని, ఒక నోడల్ అధికారిని నియమించాలని కలెక్టర్ సూచించారు.

ఏపీ స్టేట్ ఇన్స్టిట్యూట్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీరాజ్ సంచాలకులు జే. మురళి మాట్లాడుతూ, ఎల్ఇడి, ఇతర పరికరాలు లేకుంటే అద్దెకు తీసుకుంటే అందుకు అవసరమైన బడ్జెట్ కేటాయిస్తామన్నారు. ఈనెల21 నుండి డిసెంబర్ 20 వరకు నెల రోజుల పాటు ఇచ్చే శిక్షణలో ఒక్కో బ్యాచ్ కు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతి అధికారి కొండలరావు, డివిజనల్ అభివృద్ధి అధికారి శాంతకుమారి, అల్లూరి, అనకాపల్లి జిల్లాల హెల్త్ ఫుల్ ఆర్గనైజేషన్ జోనల్ కో-ఆర్డినేటర్ లక్ష్మయ్య, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల హెల్త్ ఫుల్ ఆర్గనైజేషన్ జోనల్ కో-ఆర్డినేటర్ లక్ష్మణరావు, రీజనల్ ఫెలిసిటేటర్ కే.వి ఆర్. మూర్తి, పంచాయతి రాజ్ సహాయ కమిషనర్ కృష్ణమోహన్, ట్రైనింగ్ మేనేజర్ చంద్రశేఖర్, మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

150 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: అక్రమంగా తరలిస్తున్న 150 కిలోల గంజాయిని ముందస్తు సమాచారంతో స్థానిక ఎస్సై రవీంద్ర పట్టుకున్నారు. స్థానిక ఎస్సై కె.రవీంద్ర బుధవారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం... గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందడంతో మండలంలోని కుమడ పంచాయతీ కేంద్రం కూడలిలో పోలీసులు తనిఖీలు చేశారన్నారు బూసిపుట్ ప్రాంతం నుంచి వచ్చిన తనిఖీలు చేయగా ఆరు ప్లాస్టిక్ బ్యాగులలో 150 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి రూ.95వేల నగదును, రెండు కీప్యాడ్ మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ కు తరలించారు. మిగతా ఐదుగురు స్మగ్లర్లు పరారయ్యారన్నారు. ఈ తనిఖీలలో ఎఎస్సై పి.తిరుపతి, పోలీసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట

శిశు సంక్షేమ శాఖ పీడీ ఎన్.సూర్యలక్ష్మి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బొండ్లమామిడి, దిగిడుపుట్టు, తాడిపుట్టు, పెద్దగారువు అంగన్వాడీ కేంద్రాలను శిశు సంక్షేమ శాఖ పీడీ ఎన్.సూర్యలక్ష్మి బుధవారం తనిఖీలు చేపట్టారు. అనంతరం అమె మాట్లాడుతూ, గర్భిణీ లు, బాలింతలు తీసుకోవలసిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. అపరిచితమైన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి జీవితాలను నష్టం చేసుకోకూడదని ఆమె సూచించారు. విద్యపై మక్కువ చూపించి ఉన్నత శిఖరాలకు ఎదిగి మంచి ప్రయోజకులుగా ఎదిగి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తేవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి, సూపర్వైజర్లు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పలు గ్రామాల్లో గడప గడపకూ...

ప్రజాశక్తి-జి.మాడుగుల: సిద్ధాంతాలు, విలువలు లేని పార్టీలను, రాజకీయ నాయకులను 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా తిరస్కరించాలని పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలో బొయితిలి గ్రామ సచివాలయం పరిధిలోని కిల్లంకోట పంచాయతీ చెలకపనస, కిల్లంకోట, బంధవీధి, కప్పలు, కోడిమామిడి, కురిడేలు గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గిరిజనులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి, పలువురు సర్పంచులు ఎంపిటిసిలు వైసిపి సీనియర్ నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-చింతపల్లి : రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ తోనే రక్షణ ఉంటుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్ ఎం వి వి ప్రసాద్ అన్నారు. ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య ఆధ్వర్యంలో పెద్ద బరడ పంచాయతీ చింతలూరు గ్రామంలో నిర్వహించిన బాబు షూరిటీ... భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ లీగల్ అడ్వైజర్ కిల్లో రాజన్ తో కలసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం పురోభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షులు బేరా సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి పొత్తూరు రాంబాబు, సీనియర్ నాయకులు ఉండా నాగేశ్వరరావు, కిమిడి శ్రీరాములు, యువ నాయకులు మూర్తి, మల్లేష్, ఈశ్వరరావు, చింతపల్లి మండల జనసేన నాయకులు ఉల్లి సీతారాం, పీ వెంకట్, వీ.సాయి, కే రాజేష్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు యూనియన్ బ్యాంకు ఎటిఎంకు మరమ్మతులు

మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు యూనియన్ బ్యాంక్ ఎటిఎంకు ఎట్టకేలకు మరమ్మతులు చేయడంతో బుధవారం సాయంత్రం నుండి వినియోగంలోకి వచ్చింది. ఈ ఎటిఎం పాడై 15 రోజులు గడిచింది. ఈ కాలంలో విత్‌డ్రా కాక ఖాతాదారులు, ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఏటీఎం పాడైందని యూనియన్ బ్యాంక్ మేనేజర్ చిన్నారావు దృష్టికి ఖాతాదారులు తీసుకెళ్లగా, ఆయన పై అధికారులకు సమస్యను తెలియజేశారు. దీంతో ఏటీఎం సర్వీస్ ఇంజనీరు శ్రీనివాస్‌ను బుధవారం సీలేరు పంపించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీనిపై సర్వీసు ఇంజనీరు శ్రీనివాస్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా డబ్బులు డిపాజిట్ చేసే బకెట్, డబ్బులు విత్ డ్రా చేసే రిగగ్రైజ్డ్ యూనిట్ రోలర్ అరిగిపోయి మరమ్మతులు గురైనట్లు గుర్తించామన్నారు. వాటి స్థానంలో కొత్త పరికరాల్ని అమర్చి ఏటీఎం అందుబాటులో తీసుకొచ్చినట్లు చెప్పారు. కొత్త పరికరాల విలువ సుమారు మూడు లక్షల రూపాయల వరకు ఉంటుందని చెప్పారు. ఏటీఎంలో ఏసీలు నిరంతరం పని చేయాలని, అవి పనిచేయకపోవడం వలన ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని వెల్లడించారు.

ఏజెన్సీ జర్నలిస్టులకు షరతుల్లేకుండా ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీ జర్నలిస్టులకు షరతులు లేకుండా ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ విద్య అందించాలని, వారి పిల్లలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించాలని టిడిపి రంపచోడవరం మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మార్పునకు జర్నలిస్టులే కీలకమని, వారి ఇబ్బందులు పరిగణనలోకి తీసుకొని షరతులు లేకుండా సంబంధిత డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే తమ అధినేత చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకువెళ్లి వారి సమస్యలను పరిష్కరించే మార్గంలో ముందుంటామని వెల్లడించారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అనుమతి లేకుండా బాణసంచా సామగ్రి విక్రయించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని రాజవొమ్మంగి స్టేషన్ హౌస్ ఆఫీసర్ టీజీ నరేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా మందు గుండు సామగ్రి తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఓల్డ్ టౌన్‌లో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. 58 రోజులకుగాను నగదు రూపంలో రూ.38 లక్షలా 20 వేలా 413 ఆదాయం రాగా, బంగారం 116.500 మిల్లీగ్రాములు, వెండి 1 గ్రాము 25 మిల్లీ గ్రాములు, కొంత ఫారిన్ కరెన్సీ కూడా వచ్చిందని ఉప కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శిరీష మీడియాకు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆమెతోపాటు ధర్మకర్తలు బొదిలపాటి సత్య రూపవాణి, ఎం.ధనలత, ఎన్ఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, సురేష్, సహాయ కార్య నిర్వహణ అధికారి కె.తిరుమలేశ్వరరావు, ఎస్.వసంత కుమార్ పాల్గొన్నారు.

పూర్ణా మార్కెట్ 35వ వార్డు పరిధిలో ఉన్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానం దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు అనంతర హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. హుండీ, ముడుపుల ద్వారా రూ.14 లక్షలా 5 వేలా 407 ఆదాయం వచ్చిందని దేవస్థానం చైర్మన్ నాయన మల్లిబాబు మీడియాకు తెలిపారు. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం

సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) విశాఖలోని కింగ్ జార్జి ఆసుపత్రి సిఎస్ఆర్ బ్లాక్‌లో నిరంతరం విద్యుత్ ఉండేందుకుగాను ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అందించే వైద్యసేవలతో పాటు రోగులకు, వారి సహాయకులకు అవసరమైన మౌలిక వసతులపైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే రోగులకు కూడా సకాలంలో వైద్య సేవలు అందజేస్తున్న కింగ్ జార్జ్ ఆసుపత్రిలో మరిన్ని మెరుగైన వసతులు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దీనిలో భాగంగానే ఎఆర్ మిట్టల్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలతో 120 కెవి సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను కెజిహెచ్‌లో ఏర్పాటు చేసిందన్నారు. త్వరలో విక్టోరియా ఆసుపత్రిలోనూ ఇలాంటి ప్లాంట్‌నే ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. మరో రూ.50 లక్షల నిధులతో చిన్నపిల్లల వసతి గృహాలను అభివృద్ధి చేయనుందన్నారు. లయన్స్ క్లబ్ సహకారంతో కెజిహెచ్‌లో రోగుల సౌకర్యార్థం వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన రూ.50 వేలు విలువగల శాశ్వత బెంచీలను సైతం కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా వైద్యులందరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఎఎంసి ప్రిన్సిపల్ బుచ్చిరాజు, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ వైజాగ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రవీంద్రనాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం.మహేష్, వైస్ గవర్నర్ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

జూనియర్ ఎన్‌టిఆర్ అభిమాని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇటీవల మరణించిన ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ పిన్నింటి కృష్ణ యాదవ్ కుటుంబానికి ఎపి, తెలంగాణ స్టేట్ వైడ్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్టేట్ వైడ్ కన్వీనర్లు అందరూ కలిసి సమకూర్చిన రూ.4 లక్షలా 25 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం కృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో స్టేట్ వైడ్ ఉత్తరాంధ్ర కన్వీనర్లు నల్లూరు సూర్యనారాయణ, నొడగల నాయుడు, దుంగా శ్రీధర్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్టేట్ వైడ్ కన్వీనర్ నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ అభిమానులకు ఎల్లప్పుడూ ఎన్‌టిఆర్ అండదండలు ఉంటాయన్నారు. భవిష్యత్తులో ఎన్‌టిఆర్ ట్రస్ట్ ద్వారా ఫాన్స్‌కు ఆర్థిక తోడ్పాటు అందిస్తామన్నారు.

వైజాగ్ పరిపూర్ణ ఆకర్షిత నగరం

కేరమెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రైనార్డ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరం పరిపూర్ణ ఆకర్షిత నగరంగా ఇతర దేశాలకు ఆదర్శప్రాయంగా ఉందని అమెరికాకు చెందిన కేరమెల్ సిటీ గౌరవ మేయర్ జేమ్స్ బ్రైనార్డ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆర్‌కె బీచ్ కాళీమాత ఆలయం ఎదురుగా తీరంలో జివిఎంసి ఏర్పాటు చేసిన 'స్వచ్ఛత ఇకో-వైజాగ్ అవార్డు' కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగరం ప్రపంచంలోనే ఆకర్షణీయ నగరాలలో ఒకటిగా నిలిచిందని, ఇక్కడి అందాలు కనువిందు చేస్తాయని అన్నారు. జివిఎంసి అమలు చేస్తున్న స్వచ్ఛత ఇకో వైజాగ్ కార్యక్రమాల ద్వారా విశాఖ నగరానికి భారతదేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో కూడా గుర్తింపు వస్తుందని అన్నారు. ఈ స్వచ్ఛత ఇకో వైజాగ్ అవార్డుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జివిఎంసి తనను ఆహ్వానించినందుకు ఎంతో సంతోషంగా వుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్లు, వార్డు సభ్యులు, జివిఎంసి అధికారులతో కలిసి 'స్వచ్ఛత ఇకో వైజాగ్ అవార్డు' లోగోను, బ్రోచర్‌ను, స్వచ్ఛ దీపావళి డిజిటల్ సిగ్నేచర్ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. అనంతరం విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ విశాఖ నగరాన్ని ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాల కలిగిన పర్యావరణ నగరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన కార్యక్రమమే ఇకో-వైజాగ్ అని తెలిపారు. జివిఎంసి పరిధిలో వున్న వార్డుల అభివృద్ధి కోసం వార్డు స్థాయిలో ఆరోగ్యవంతమైన పోటీతత్వాన్ని పెంపొందిస్తున్నామన్నారు. స్వచ్ఛ అవార్డుల్లో మొదటి ర్యాంక్ సాధించిన వార్డుకు రూ.20 లక్షలు, రెండో ర్యాంక్ సాధించిన వార్డుకు రూ.10 లక్షలు, మూడో ర్యాంక్ సాధించిన వార్డుకు రూ.5 లక్షలు నగదు ప్రైజ్‌ను అందిస్తూ, ఆ నగదు మొత్తాలను ఆయా వార్డుల అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, కార్పొరేటర్లు పెద్దింటి ఉషశ్రీ, రెయ్యి వెంకట రమణ, బిపిన్ కుమార్ జైన్, బీశెట్టి వసంత, అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్.వర్మ, సెక్రటరీ నల్లనయ్య పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న బ్యాంకు ఛైర్మన్ రాంబాబు

కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు అవార్డు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు 'బ్యాంకో బ్లూ రిబ్బన్ అవార్డు-2023' లభించింది. ఇటీవల డామన్‌లోని డెల్టిన్ రిసార్ట్‌లో జరిగిన బ్యాంకో బ్లూ రిబ్బన్ వేడుకల్లో కనకమహాలక్ష్మి బ్యాంకు ఈ అవార్డును పొందింది. ఉత్తమ పనితీరును కనబరుస్తున్న సహకార బ్యాంకులను ప్రోత్సహించేందుకు బ్యాంకో, గెలాక్సీ ఇన్మా దేశవ్యాప్తంగా బ్యాంకర్ల స్ఫూర్తిని ప్రోత్సహించడానికి ప్రతి యేటా బ్యాంక్ బ్లూ రిబ్బన్ అవార్డులను ప్రకటిస్తాయి. దీనిలో భాగంగా ఈ ఏడాది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు ఈ అవార్డును ప్రకటించాయి. తమ బ్యాంకుకు అవార్డు లభించడం చాలా సంతోషంగా ఉందని చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు బ్యాంకు సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఖాతాదారుల సహకారంతోనే తాము ఈ ప్రగతి సాధించగలుగుతున్నామని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కలెక్టర్‌కు జర్నలిస్టుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయంలో మొదటి నుంచీ సహకరిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. ఇదే సహకారాన్ని భవిష్యత్తులోనూ అందించాలని విజ్ఞప్తి చేసింది. సొసైటీ గౌరవ అధ్యక్షులు కెజి.రాఘవేంద్ర రెడ్డి, జి.జనార్ధన్ రావు, సొసైటీ అధ్యక్షులు బి.రవికాంత్ బుధవారం కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ స్థాపించిన నాటి నుంచి విలువైన సలహాలు, సూచనలతో సొసైటీకి సరైన దిశా నిర్దేశం చేస్తూ సహకరించిన కలక్టర్ మల్లికార్జునకు ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డుల జారీలోనూ పారదర్శకంగా వ్యవహరించి, ఇప్పుడు ఇళ్ల స్థలాల కేటాయింపులోనూ కీలక భూమిక పోషించిన కలెక్టర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి గైడ్ లైన్స్ వచ్చిన వెంటనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు అంశాన్ని వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవ సలహాదారులు పి.సత్యనారాయణ, ధవలేశ్వరం రవికుమార్, ఉపాధ్యక్షులు కొయిలాడ పరుశురాం, దుక్కా మురళీకృష్ణా రెడ్డి, పి.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ఎం.చిట్టిబాబు, అనురాధ, బందరు శివ ప్రసాద్, కోశాధికారి ఆలపాటి శరత్ కుమార్, ప్రత్యేక ఆహ్వానితులు యర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రౌడీషీటర్ హత్య కేసులో..
ముగ్గురికి జీవిత ఖైదు, జరిమానా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో 2011లో జరిగిన హత్య కేసుకు సంబంధించి ముగ్గురికి జీవిత ఖైదు, జరిమానా న్యాయస్థానం విధించినట్టు విశాఖపట్నం డీసీపీ (లా అండ్ ఆర్డర్) - 1 ఎ.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2011లో ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రౌడీ షీటర్ పందిరి రవి హత్య కేసులో ప్రధాన నిందితులు ఏడుగురిలో ముగ్గురికి జీవిత కారాగార శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించినట్టు తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో మరొక రెండు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి లాలం శ్రీధర్ బుధవారం తీర్పు చెప్పారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన ఏడుగురిలో ముగ్గురు ఇప్పటికే మృతి చెందగా ఒక వ్యక్తి 2015 నుంచి పరారీలో ఉన్నాడన్నారు. మిగిలిన నిందితుల్లో అక్రబోయిన అప్పలరాజు, వనపల్లి శివ, ముద్దాడ అమర్‌నాథ్‌లకు శిక్ష పడినట్టు వెల్లడించారు.